


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (6)

చివరి విడత: మలి సందడి (6)

***కొత్తగా కొత్తకొత్తగా (బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)***

"**దీనికి జర్మనీవాళ్లు** బాగానే నచ్చారు. వాళ్ల తిండి కూడా నచ్చితే బాగుణ్ణు" అన్నాను.

శ్రీమతి వెంటనే, "బాగుంది. వీళ్లకి గొడ్డు మాంసం ఇష్టం. మనమూ తినాలంటారా?" అంది.

"వీళ్లకి గొడ్డు మాంసం ఇష్టమే. కానీ వాళ్లు తినేది అదొక్కటే కాదు. బీరు ఇష్టం. కానీ తాగేది అదొక్కటే కాదు. పాలు, పళ్లు, పప్పులు, ధాన్యాలు, కూరగాయలు, వెన్న, ఛీజ్ – అన్నీ దొరుకుతాయిక్కడ. పైగా మన దేశంలోలా ఇక్కడ ఆహారపదార్థాల్లో కల్తీ ఉండదు" అన్నాను.

"ఐతే దొరికినవాటిలో మనకు నచ్చినవి ఎంజాయ్ చేద్దాం" అంది శ్రీమతి.

"అలా కాదు. ఇది శీతల దేశం. ఆ చలిని తట్టుకోవాలంటే వంట్లోకి పోషకపదార్థాలు వెళ్లాలి. పిల్లలకి కనీసం కోడిగుడ్లయినా పెట్టకపోతే – అనారోగ్యం పాలవుతారని నా భయం" అన్నాను.

"మిమ్మల్ని మిగతా ఇండియన్సు ఇలాగే భయపెట్టారు. మీరు లెక్క చెయ్యలేదు. ఇప్పుడు మీరు నన్ను భయపెడుతున్నారు. నేనూ లెక్కచెయ్యను" అందామె దృఢంగా.

"ఆదికాదు వసూ! ఛీజ్‌లో మంచి పోషకవిలువలున్నాయి. ఫక్తు శాకాహారం. ఎలాగో అలా అదైనా వాళ్లకి అలవాటు చెయ్యాలి"

"భువనేశ్వర్లోనూ ఏడాదికి మూణ్ణెల్లు భరించలేని చలి కదా! అప్పుడక్కడ మన అలవాట్లలో మార్పు చేసుకున్నామా? పిల్లలకేమైనా అయిందా? భయాన్ని పక్కన పెట్టండి. వివేకం పని చేస్తుంది" అందామె.

అప్పుడు ఇద్దరం – జర్మనీలో దొరికే శాకాహారపదార్థాల జాబితా వేసుకున్నాం. వాటిలో పిల్లలకి నచ్చేవి ఏమిటా అని చర్చించసాగాం.

ఆ చర్చలో గతాన్ని పునశ్చరణ చేసుకోవడం జరిగింది.

కొందరు ఇండియన్సూ, జర్మన్సూ కూడా నాతో, "ఇక్కడ ఛీజ్ తినడం చాలా అవసరం. శాకాహారివి కాబట్టి నీకైతే మరీ అవసరం. నిజానికి ఛీజ్ చాలా రుచిగా ఉంటుంది. ఒక వయసొచ్చేక కొత్త అలవాట్లు చేసుకోవడం కష్టం. అందువల్లనేమో నీకు ఛీజ్ నచ్చి ఉండదు. నీ పిల్లలు ఎగబడి తినకపోతే మమ్మల్నడుగు" అంటూండేవారు. అలా ఛీజ్ నా బుర్రలోకి బాగా ఎక్కేసింది.

"నువ్వు రుచికి అంతగా ప్రాధాన్యమివ్వవు. అవసరమైతే కాకరకాయని కూడా రసగుల్లాలా తినెయ్యగలవు. మనవాళ్లకి నీ పోలికొచ్చి ఉంటే బాగుండేది" అన్నాను.

శ్రీమతి నవ్వి, "ఏంచేస్తాం – వెధవలకి – అన్నీ మీ పోలికలే" అంది. ఆ గొంతులో చిరాకుకి బదులు ముచ్చట ధ్వనిస్తోంది.

నేను గతుక్కుమని, "అంటే ఆ పోలికలు వెధవలకి ఉంటాయనా?" అన్నాను. ఐతే నేనూ ముచ్చటగానే అన్నాను.

శ్రీమతి నాలిక్కరుచుకుని, "మీరేమనుకోండి. మీ పోలిక ఏదైనా నాకు ముచ్చటగానే ఉంటుంది" అంది తన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ.

"అది నాకూ తెలుసు. కానీ నువ్వలా ముచ్చటపడి ఊరుకుంటే ఎలా? ఈ చలి తట్టుకునేందుకు వంటికి కావాల్సిన శక్తినిచ్చేవాటిలో ముఖ్యమైనది ఛీజ్. ఇక్కడివాళ్లది ఎంతో ఇష్టంగా తింటారు. మనవాళ్లు కూడా తినే మార్గం చూడాలి" అన్నాను.

"అది సరే, మరి మీరెందుకు తినడం లేదు?" అంది శ్రీమతి.

ఏం చెబుతాను? నాకా రుచి నచ్చలేదు. అదే పోలిక పిల్లలకీ వచ్చింది. ఈ విషయంలో వాళ్లింకా ఓ మెట్టు పైనే ఉన్నారు. వాళ్లకి పాలు కూడా నచ్చలేదు. చల్లగానూ, వేడిగానూ కూడా తాగమంటున్నారు.

వాళ్లు పాలు తాగకపోవడం ఇక్కడ మొదలైన సమస్య కాదు. ఒకసారి ఘనపదార్థాల రుచి మరిగేక చిన్నప్పట్నించీ వాళ్లు పాలకి విముఖులు. ఇండియాలో ఎవరింటికైనా వెళ్లినప్పుడు మావాళ్లు పాలు తాగరంటే నమ్మేవారు కాదు. మొహమాటం కాదని రూఢి అయ్యేక, "ఈ రోజుల్లో పాలు తాగని పిల్లలుంటారా? వాళ్లకి పాలు కొనిచ్చే స్తోమతు లేక – తెనాలి రామకృష్ణుడిలాగా ఏదో చిట్కా వేసి ఉంటారు" అని చనువున్న కొందరు మా మొహంమీదే అనేశారు – హాస్యానికన్నట్లు.

ఒకసారి శ్రీకృష్ణదేవరాయలు తన ఆస్థానంలో కొందరికి పిల్లుల పెంపకం పోటీ నిర్వహించాడు. అందుకుగానూ ఒకొక్కరికి ఓ పిల్లినీ, దాని పోషణకుగానూ ఓ పాడిఆవునీ ఇచ్చి నెల రోజులు గడువిచ్చాడు. తెనాలి రామష్ణుడికిది పనికిమాలిన పోటీగా తోచింది. రాజుకి బుద్ధి చెప్పాలనుకున్నాడు. అతగాడు పిల్లిని ఇంటికి తీసుకెళ్లి ఓ గిన్నెలో అప్పుడే కాచిన వేడి వేడి పాలు పోసి పిల్లి ముందుంచాడు. పిల్లి పాలకోసం గిన్నెలో మూతి పెట్టింది. మూతి కాలింది. ఆ తర్వాతనుంచి ఆ పిల్లి పాలను చూస్తే భయపడేది. నెల రోజుల తర్వాత పోటీదారులందరూ తమతమ పిల్లులతో రాజు దగ్గరకు వెళ్లారు. అందరి పిల్లులూ బాగా బలిసున్నాయి. రామకృష్ణుడి పిల్లి ఒక్కటే – బక్కచిక్కి ఉంది. అదేమని రాజు అడిగితే, తన పిల్లి పాలు తాగదనీ, ఏంచెయ్యాలో పాలుపోలేదనీ అన్నాడతడు. రాజు నమ్మలేదు. గిన్నెలో పాలు పోసి దానిముందు పెడితే – నిజంగానే ఆ పిల్లి ఆ పాలు ముట్టలేదు. రాజు వెంటనే, "పిల్లి పాలు తాగకపోవడమేంటి? నువ్వే ఏదో చేసుంటావ్!" అని నిలదీశాడు. అప్పుడు రామకృష్ణుడు తను చేసింది చెప్పాడు. "ఇందువల్ల నువ్వు సాధించిందేమిటి? పోటీలో ఓడిపోయావు. ఓ మూగజీవికి ఆహారం లేకుండా చేశావు. ఇది నీకు బాగుందా?" అన్నాడు. దానికి రామకృష్ణుడు, "పిల్లికి పాలు సహజ ఆహారం కాదు. పాలు దాని ఆరోగ్యానికి మంచివి కాదు. మనిషి పెంచుకోవడం మొదలెట్టేక పిల్లికి బలవంతంగా అలవాటు చేసిన ఆహారమది. ఈ పిల్లి బక్కచిక్కడానికి కారణం, మా ఇంట్లో మాంసం కానీ ఎలుకలు కానీ లేకపోవడం. మిగతా పిల్లులు బలంగా ఉండడానికి కారణం – వాటికి మాంసమో, ఎలుకలో దొరకడమే తప్ప పాలు తాగడం కాదు. ఇక పోటీలో ఓడడమంటారా – నా కుటుంబానికి సరిపడ పాలునిచ్చే ఆవుని ముందే నాకు కానుకగా ఇచ్చారు. గెలుపు వల్ల అదనంగా నేను సాధించేదేముంది?" అన్నాడు.

నిజంగా జరిగిందో లేదో కానీ తెలుగునాట ఇది ఇంటింటి కథ. నా మిత్రులు కొందరు దీన్ని – పాలపట్ల మా పిల్లల విముఖతకీ అన్వయించినప్పుడు నాకు కోపం రాలేదు. ఉన్నమాటన్నప్పుడు కదా, ఉలుకొచ్చేది!

నిజానికి పాల విషయంలో మా అబ్బాయితో సమస్య లేదు. మంచి మాటలాడి మురిపించి వాడిచేత ఏదైనా తినిపించొచ్చు. కానీ వాడు 1974లో 'ఇండియా ఈజ్ ఇందిరా, ఇందిరా ఈజ్ ఇండియా' అన్న దేవ్‌కాంత్ బారువా ఇందిరాగాంధీకి ఎంత భక్తుడో – తన అక్కకి అంత భక్తుడు.

అక్క మాట వేదవాక్కు వాడికి. మేమేం చెప్పినా అక్క ఓకే చేస్తేనే తనూ ఓకే చేస్తాడు. తనేం చేసినా అక్కని చూసి చేస్తాడు. అక్క తిన్నవన్నీ తనూ తింటాడు. దానికి నచ్చనిది తనకూ నచ్చదంటాడు. దేనికైనా వాణ్ణి ఒప్పించాలంటే అక్క వైపునుంచి నరుక్కు రావాలి. కానీ మా పాప కొరకరాని కొయ్య.

అదృష్టవశాత్తూ పాపకి వెన్న నచ్చింది. కాబట్టి వాడికీ నచ్చింది.

"సరేలెండి, కాలమే అన్నింటికీ పరిష్కారాలు చూపిస్తుంది" అంది శ్రీమతి – ఇక ఆ చర్చని ఆపేద్దామన్నట్లు.

దాంతో నేనూ ఆ విషయాన్ని పక్కకి నెట్టి, "ఇది కొన్నప్పట్నించి ఈ సందర్భంకోసం ఎదురు చూస్తున్నాను. వీళ్ల మాటలు రికార్డు చేసి వీళ్లకి వినిపించి థ్రిల్ చెయ్యాలి" అంటూ టేపు రికార్డరు చూపించాను.

శ్రీమతి వెంటనే పిల్లల్ని పిలవబోతే, "ముందు నువ్వు" అన్నాను.

శ్రీమతి ఒప్పుకోలేదు. ఇలాంటి విషయాల్లో తన మొహమాటం ఇంతా అంతా కాదు. స్టుడియోకి వెళ్లి ఫొటో తీయించుకునేటప్పుడు కూడా – చిరునవ్వు నవ్వడానికి బదులు మనిషి బిగుసుకు పోతుంది. టెపు రికార్డరుకీ అలాగే బిగుసుకు పోయింది. నేను మరీ మరీ నొక్కిస్తే, "ఐతే, ముందు మీరు" అంది.

"అలా ఎందుకు?"

"నాకు మీ గొంతు రికార్డరులో వినాలనుంది"

నేను నవ్వి, "ఐతే ఇప్పుడు కొత్తగా రికార్డు చెయ్యనక్కర్లేదు. కొన్ని ఊహా'గానాలు'న్నాయి" అన్నాను.

ఊహా'గానాలు' అంటే తనకి తెలుసు.

నాకు వి. శాంతారాం తీసిన నవరంగ్ (1959) సినిమా అంటే చెప్పలేనంత ఇష్టం. అందులో దివాకర్ అనే కవికి తన భార్య జమున అంటే ప్రాణం. తన కవిత్వానికి ఆమెను ప్రేరణగా తీసుకుని – ఆమెలో ఓ మోహినిని దర్శించి ఊహాలోకంలో విహరిస్తుంటాడు. ఆమె మామూలుగా వంట చేస్తుంటే – మోహిని నాట్యభంగిమలు కనిపిస్తాయి. మోహిని వేరెవరో అనుకుని అమె భర్తని వదిలి పుట్టింటికి వెళ్లిపోతే – అతడి ఊహాప్రపంచం కూలిపోయి, కవిత్వానికి స్ఫూర్తి లేకుండా పోతుంది. తనే అతడి మోహిని అని జమున గుర్తించడం కథకి ముగింపు. మోహిని నాట్యాలూ, దివాకర్ పాటలతో నిండిన ఈ దృశ్యకావ్యం భారత సినీ చరిత్రలో ఓ అద్భుతం.

దంపతుల్లో ఇలాంటి భావుకతనీ, ఊహాలోకాన్నీ మేమిద్దరం ఇష్టపడతాం. ఎన్నో సందర్భాల్లో ఊహాజనిత ఘటనల్ని పాటలుగా మలచుకుని వినోదించేవాళ్లం. అవే మా ఊహా'గానాలు'. జర్మనీ వచ్చేక అలాంటివి కొన్ని ఉన్నాయి. వాటిలో ఒకటి – శ్రీమతిని జర్మనీకి రప్పించే ఏర్పాట్లు ముగిసేక – నాలో కలిగిన ఊహా'గానం' – ఇక్కడికి వచ్చీరాగానే ఆమె అలుకకి స్పందన. అదామెకి వినిపించాను.

'ప్రేమతో నిను పలుకరిస్తే పలుకకున్నావూ
కారణము ఏమని అడుగుతుంటే చెప్పకున్నావూ
తెలియదా నీకు
నేనేమి చేసినా
ఏది రాసినా
ఎచటికేగినా
ఎలా మసలినా
నీకోసమే ..... నీకోసమేనని'

గాయకుణ్ణి కావాలన్న తపన నాలో లేదు. ఉన్నా గాయకుడిగా రాణించే ప్రావీణ్యం లేదు.

ఒక స్పందనకు రూపకల్పనగా వెలువడిన పాట అది.

ఆ అనుభూతి మా ఇద్దరికే ప్రత్యేకం, పరిమితం.

పాట వింటూ శ్రీమతి ఓసారి కళ్లు తుడుచుకుంది. మునుపటి రోజు తన అలుక గుర్తొచ్చినట్లుంది.

"బాగా ఊహిస్తారండీ మీరు!" అంది నెమ్మదిగా.

కళ్లు నావీ తడిశాయి. “ఈ ప్రపంచంలో మహా మహా కవుల మహా మహా కావ్యాలకే మూలం ప్రేమ. సామాన్యులం. ప్రేమ మనని విడిచి పెడుతుందా?” అని – “ఇక నీ గొంతుని రికార్డు చేసే భాగ్యం నాకు కలిగించు” అన్నాను.

టేపు రికార్డర్లో తమ గొంతు వినాలన్న కోరిక ఎవరికుండదు?

శ్రీమతి మొహమాట పడుతూనే ఓ సారి గొంతు సవరించుకుంది. అప్పుడు తన మొహం చూస్తే – ఈ ప్రపంచమంతా ఒక్కటై తననే గుచ్చి గుచ్చి చూస్తోందా అన్న భావం కనిపిస్తుంది.

“నాకు మీలా స్వంత కవిత్వం రాదు” అంది ఓ క్షణమాగి.

“పాడడానికి స్వంత కవిత్వం రాకపోతే – అది వినేవాళ్ల అదృష్టం. పేరున్నవారి ముచ్చటైన పదాలు వినొచ్చు కదా!” అన్నాను.

ఆ తర్వాత కూడ కాసేపు బెలిపించుకుని మళ్లీ గొంతు సవరించుకుని – “నోము సినిమాలో పాట” అంది.

“ఊఁ” అని రికార్డరు ఆన్ చేశాను.

‘నోముపండించిన నా సామీ నను కరుణించ రావేమీ

నిను నమ్మితిరా, నిను కొలిచితిరా, అలుక చాలించి పాలింపవా....’

నేను నా ఊహల్లో తనకి అలుకని అంటగట్టి, నా మాటలతో శాంతింప జేశాను. తను ఊహల్లో నాకూ అలుకను అంటగట్టి – ఉపశమనానికి మహాకవి దాశరథి మాటల్ని వాడింది. సంగీత దర్శకుడు సత్యం వరసని ఉపయోగించింది.

మొహమాటంవల్ల తక్కువ శ్రుతిలో మొదలెట్టింది. చివర్లో పాటలోనూ శ్రుతి బాగా తక్కువయ్యేసరికి ఊపిరందక కొంచెం ఇబ్బంది పడింది.

పాట ఆపి రికార్డింగ్ ఆపెయ్యమని సైగ చేసింది. ఆపేశాను. కాసెట్ వెనక్కి తిప్పి ప్లే ఆన్ చేసి, “ఇప్పుడు విను” అన్నాను.

అంతకుముందు ఇండియాలో ఒకరిద్దరి ఇళ్లలో టేపు రికార్డర్లు చూసి ఉన్నా – తన పాట రికార్డు చేసుకోవడం తొలి అనుభవం. వినాలని ఉన్నా చటుక్కున అక్కణ్ణించి లేచి, “మీరేం చేస్తున్నారర్రా” అంటూ పిల్లల గ్గరకు వెళ్లింది.

పిల్లలు కదా – వాళ్లకి పరిసరాలతో నిమిత్తం లేదు. ఇద్దరూ ఏవో ఆటపాటల్లో ఉన్నారు.

శ్రీమతి వాళ్లని సమీపించేసరికి – ‘నోము పండించిన నా సామీ...” అంటోంది రికార్డరు ఆమె గొంతులో....

జర్మనీలో మొదటిసారిగా రికార్డు చేసిన తన పాట – ఆ తర్వాత రికార్డరు లేకపోయినా ఎప్పటికీ నా చెవుల్లో మధురంగా ధ్వనిస్తూనే ఉంటుంది.

పిల్లలు తమని సమీపిస్తున్న తల్లిని చూశారు. తల్లికి సమీపంలో లేని ఆమె గొంతుని విన్నారు. ఒకసారి ఆటూ ఇటూ ఆశ్చర్యంగా చూశారు.

“తత్తా, అమ్మ...?!” అన్నాడు బాబు, వాడు అక్కకి తల్లిని బదులు టేపు రికార్డర్ని చూపిస్తూ.

పాపది ఈడుకి మించిన తెలివి కదా – “టేపు రికార్డర్!” అంది నావంక చూస్తూ. అంటూనే లేచి నిలబడింది.

భువనేశ్వర్లో మా కాలనీలో నా మిత్రుడొకడు చిన్నప్పటి దాని పాటలు రికార్డు చేసి ఓ సారి వినిపించి కాసెట్ నాకిచ్చాడు. అప్పుడు పాప ఎంత మురిసిపోయిందో. వాళ్లింటికెళ్లి కాసెట్ విందామని అడిగేది. వాళ్లు పిలిస్తేనే వెళ్లాలని చెబితే – వాళ్లు పిల్చినప్పుడు కాసెట్ గురించి తనే గుర్తు చేసేది. మన పిల్ల కాబట్టి మనకి ముద్దు కానీ, అస్తమానూ వినిపించాలంటే వాళ్లేమనుకుంటారోనన్న సంకోచముంటుంది కదా – ఒక్కసారి మాత్రమే నేను దాని కోరిక తీర్చాను. ఇప్పుడు మాకే ఓ స్వంత రికార్డరొచ్చింది.

పాప పరుగున నా దగ్గరకొస్తే – “నీ కాసెట్ నా దగ్గరుంది. వినిపించనా?” అన్నాను.

అది ఒప్పుకోలేదు. కొత్తగా పాడతానంది. సరే నన్నాను.

నేను రెడీ అనగానే – అది వెంటనే – "నోము పండించిన నా సామీ...." అని అందుకుంది.

అమ్మ పాడింది కదా – ఆదే పాట తనూ పాడాలన్న పసి మనస్తత్వం.

దేవుడిచ్చిన వరం. దాని గొంతు శ్రుతిబద్ధం.

పాట అవగానే, శ్రీమతి అప్రయత్నంగా చప్పట్లు కొట్టి, "చాలా బాగా పాడావే" అంది.

తను చాలా బాగా పాడతానని పాపకీ నమ్మకమే. తల్లి మెచ్చుకోగానే, ఆ విషయం తనకీ తెలుసునన్నట్లు మొహం పెట్టి, "రికార్డర్లో విను" అంది కొంచెం గొప్పగా.

రికార్డర్లో పాట వింటున్నప్పుడు పాప మొహం చూడాలి. వినడమయ్యేక, "ఈ రికార్డరు అచ్చం మనదే కదూ!" అంది.

"ఊఁ" అన్నాను.

"ఎప్పుడు కావాలంటే అప్పుడు మనింట్లోనే వినొచ్చు కదూ!" అంది పాప మళ్లీ.

"ఔనమ్మా!" అని దాన్ని దగ్గరగా తీసుకున్నాను. తనకి టేపు రికార్డరు కావాలనీ, అందులో తన పాటలూ, మాటలూ రికార్డు చేసుకుని పదే పదే వినాలనీ గాఢమైన కోరిక ఉందన్న మాట! కానీ ఎప్పుడూ నన్నది నోరు విడిచి అడుగలేదు. ఎప్పుడైనా నా మిత్రుడి ఇంటికి వెడదామని మాత్రం ఆనేది.

ఈరోజు ఇలా అడిగేదాకా – నాకు దాని మనసులో నిక్షిప్తమైన ఈ కోరిక గాఢత తెలియలేదు. అడిగితే నా అసహాయతని ఒప్పుకోక తప్పేది కాదేమో!

భారత దేశంలో కుటుంబవ్యవస్థ అలాంటిది. పెద్దలను అవగాహన చేసుకుని సహకరించాలన్న సంస్కారం – నేర్పనవసరం లేదు, జీన్సులోనే ఉంటుంది.

"ఇంకో పాట పాడనా?" అంది పాప.

"నువ్వో పాట పాడావు కదా – ఇప్పుడు తమ్ముడు మరి!" అంది శ్రీమతి చప్పున. ఆమె బాబు చెయ్యి పట్టుకుని, "బాబీ, అక్క పాడింది కదా, నువ్వూ పాడతావా?" అంది.

"ఊఁ" అన్నాడు బాబు. ఆమె నడిపించుకుమటూ వాణ్ణి నా దగ్గరకు తీసుకొచ్చింది. కానీ వాడికి తన గొంతు రికార్డు చేస్తారన్న స్పృహే ఉన్నట్లు లేదు. ఓ చేతిలో ఓ ప్లాస్టిక్ డబ్బా ఉంది. రెండో చేత్తో దానిమీద మద్దెల కొడుతూ పరవశిస్తున్నాడు. వాణ్ణి ఈలోకంలోకి తీసుకు రావాలని వాడి భుజం తట్టాను. టేపు రికార్డరు చూపించి, "బాబీ, నీకేం కావాలమ్మా" అని రికార్డరు ఆన్ చేశాను.

"లేలియోలో నా పాత తావాలి" అన్నాడు వాడు వెంటనే.

అంటే వాడికి తెలుసు – తనని మేమెందుకు పిలిచామో! ఐతే వాడికి టేపు రికార్డరుకీ రేడియోకీ తేడా తెలియదు.

అప్రయత్నంగా వాణ్ణి దగ్గరగా తీసుకున్నాను. రికార్డింగుకి ఆ మాటలు చాలు.

అలా ఆ రోజు అత్యంత మధురంగా గడిచిపోయింది. రోజులన్నీ కొత్తగా కొత్త కొత్తగా గడిచిపోనున్నాయనడానికి ఆ రోజొక మచ్చుతునక మాత్రమే!

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments